


జైళ్ల శాఖ డైరీని ఆవిష్కరిస్తున్న సీఎం రేవంత్ రెడ్డి, డీజీ సౌమ్యమిశ్రా

జైళ్లశాఖ డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ

సైదాబాద్, జనవరి 7(ఆంధ్రజ్యోతి): తెలంగాణ జైళ్ల శాఖ క్యాలెండర్, డైరీలను ముఖ్యమంత్రి సీఎం రేవంత్ రెడ్డి మంగళవారం ఆవిష్కరించారు. సీఎంకు జైళ్ల శాఖ అధికారులు పుష్పగుచ్ఛం అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా హైదరాబాద్ నల్సార్ యూనివర్సిటీ ఆఫ్ లా సహకారంతో తెలంగాణ జైళ్లశాఖ రూపొందించిన కొత్త క్రిమినల్ చట్టాలపై హ్యాండ్ బుక్‌ను సీఎం ఆవిష్కరించారు. కార్యక్రమంలో జైళ్లశాఖ డీజీ డాక్టర్ సౌమ్యమిశ్రా, ఐజీలు వై.రాజేష్, ఎన్.మురళీబాబు, డీఐజీలు డాక్టర్ శ్రీనివాస్, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి ఖోఖో జట్టుకు భావన ఎంపిక



పిట్టల భావన

అబ్దుల్లాపూర్‌మెట్, జనవరి 7(ఆంధ్రజ్యోతి): పెద్దఅంబర్‌పేట్‌లోని రాజశ్రీ విద్యామందిర్ స్కూల్‌లో 8వ తరగతి చదువుతున్న పిట్టల భావన అండర్-14 విభాగంలో రాష్ట్రస్థాయి ఖోఖో జట్టుకు ఎంపికైంది. ఈ నెల 9 నుంచి 15 వరకు మహారాష్ట్రలోని కొల్హాపూర్‌లో జరుగనున్న 68వ ఎస్‌జీఎ‌ఫ్‌ఐ ఖోఖో చాంపియన్ షిప్‌లో భా వన పాల్గొంటున్నట్లు స్కూల్ చైర్మన్ సిద్దంకి జగన్ మోహన్‌రెడ్డి,కోచ్ నీలేష్ తెలిపారు. భావన ఒకే ఏడాదిలో మూడుసార్లు రాష్ట్ర జట్టుకు ఎంపికైనట్లు చెప్పారు. ఈ సందర్భంగా మంగళవారం స్కూల్‌లో భావనను ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.



రక్తదానం చేస్తున్న వారితో జూకూరి చైతన్య రాజు

రక్తదానంతో మరొకరికి ప్రాణదానం

మన్సూరాబాద్, జనవరి 7(ఆంధ్రజ్యోతి): సమాజ శ్రేయస్సులో భాగంగా ప్రతి ఒక్కరూ విధిగా రక్తదానం చేసి మరొకరి ప్రాణం నిలిపేందుకు ముందుకు రావాలని ప్రసిద్ధ్ మల్టీస్పెషాలిటీ ఆస్పత్రి చైర్మన్ జూకూరి చైతన్య రాజు పేర్కొన్నారు. మన్సూరాబాద్‌లోని ఆస్పత్రి ఆవరణలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా చైతన్య రాజు మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో ప్రపంచంలో రక్తం కొరత తీవ్రంగా ఉందని, ఈ కొరతను తగ్గించేందుకు ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గుండాల రమేష్, గందు రవీందర్, నిమ్మనగొట్టి నవీన్, నరేష్, భరత్, అశోకొరెడ్డి, అనిల్ గౌడ్, వినయ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



జీహెచ్ఎంసీ కమిషనర్‌కు వినతి పత్రం అందజేస్తున్న కార్పొరేటర్లు రాజశేఖర్ రెడ్డి, సుజాతానాయక్ తదితరులు

డివిజన్‌కు రూ.10 కోట్లు కేటాయించాలి

ఎల్‌బీనగర్, జనవరి 7(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ మహానగరంలోని కాంగ్రెస్ కార్పొరేటర్లు ప్రాతినిత్యం వహిస్తున్న డివిజన్లలో అభివృద్ధి పనుల కోసం ఒక్కో డివిజన్‌కు రూ. 10 కోట్ల నిధులు కేటాయించాలని జీహెచ్ఎంసీ కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి కోరారు. మంగళవారం జీహెచ్ఎంసీ కమిషనర్ ఇలంబర్తిని కలిసిన ఆయన నిధులు కేటాయించి అభివృద్ధికి సహకరించాలన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ సుజాతానాయక్, ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి మందుముల పరమేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

నిధుల కోసం జెడ్సీకి వినతి

చంపాపేట, జనవరి 7(ఆంధ్రజ్యోతి):హస్తినాపురం డివిజన్‌లోని ఆయా కాలనీల్లో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు నిధులు మంజూరు చేయాలని కోరుతూ మంగళవారం కార్పొరేటర్ సుజాతానాయక్ జీహెచ్ఎంసీ ఎల్‌బీనగర్ సర్కిల్ జోనల్ కమిషనర్ హేమంత కేశవ్ పాటిల్‌కు వినతిపత్రం అందజేశారు. కార్పొరేటర్ మాట్లాడుతూ, వివిధ కాలనీలలో సీసీ రహదారులు, యూజీడీ నిర్మాణాల కోసం నిధులు మంజూరు చేయాలని జెడ్సీని కోరగా, సానుకూలంగా స్పందించారన్నారు.

రాయన్, పోచమ్మ చెరువులను సందర్శించిన హైడ్రా, ఇరిగేషన్ అధికారులు

అబ్దుల్లాపూర్‌మెట్, జనవరి 7(ఆంధ్రజ్యోతి): నగర శివారు పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీ పసుమాములలోని రాయన్, పోచమ్మ చెరువులను మంగళవారం హైడ్రా అధికారి బాచిరెడ్డితో పాటు ఇరిగేషన్ అధికారులు సందర్శించారు. రెండు చెరువుల ఎఫ్‌టీఎల్, బఫర్ పరిధి ఆక్రమణకు గురైనట్లు హైడ్రాకు ఫిర్యాదు వెళ్లింది. దీంతో ఉన్నత అధికారుల ఆదేశాలతో ఇరిగేషన్ డీఈఈ చెన్న కేశవరెడ్డి, ఏఈఈ వంశీధర్ హైడ్రా అధికారితో కలిసి సదరు చెరువులను పరిశీలించారు. చెరువుల ఆక్రమణకు పాల్పడితే చట్టపరమైనా చర్యలు తీసుకుని క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఇరిగేషన్ వర్క్‌ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సీనియర్ సిటిజెన్ల సమస్యల పరిష్కారానికి కృషి

● కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్ రెడ్డి

వనస్థలిపురం, జనవరి 7(ఆంధ్రజ్యోతి): సీనియర్ సిటిజెన్లు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి తన వంతుగా కృషి చేస్తానని వనస్థలిపురం కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్ రెడ్డి అన్నారు. వనస్థలిపురం డివిజన్ క్రాంతి హిల్స్ కాలనీ సంక్షేమ సంఘం కార్యాలయంలో మంగళవారం సీనియర్ సిటిజన్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన క్యారమ్, చెస్ ఆటల పోటీలను కార్పొరేటర్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ, సీనియర్ సిటిజెన్ భవన నిర్మాణానికి తన వంతుగా సహకారం అందజేస్తానన్నారు. కార్య క్రమంలో కాలనీ అధ్యక్షుడు బద్దం రామ్‌రెడ్డి, వెంకట్ రెడ్డి, శ్రీనివాస్, సత్తిరెడ్డి, మోహన్ రెడ్డి పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

హయత్‌నగర్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): తుర్కయంజాల్ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని టీఎస్‌ఐఐసీ నాదర్‌గూల్ 33/11 కేవీ ఫీడర్ మరమ్మత్తుల కారణంగా బుధవారం ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ ప్రసారంలో అంతరాయం కలుగుతుందని ఏఈ వి. రవీందర్‌రెడ్డి తెలిపారు. ఫీడర్ పరిధిలోని పార్వతిపురం, గైరాన్‌కోట, ఎంఎస్‌ఆర్ హోమ్స్, ద్వారాకాపురి, మన్నెగూడ, రాగన్నగూడ, కుర్మల్‌గూడ, ఎస్‌పీఆర్ హోమ్స్, ఇందిరానగర్, జేఎన్‌యూఆర్‌ఎం అగ్రికల్చర్ ఆదిభట్ల ప్రధాన రోడ్డు, ఆయుధాల గడ్డ ప్రాంతాలలో విద్యుత్ ప్రసారంలో అంతరాయం కలుగుతుందని తెలిపారు.

సరూర్‌నగర్ డివిజన్ పరిధిలో...

సంతోష్‌నగర్: సరూర్‌నగర్ డివిజన్ పరిధిలోని 11 కేవీ ఆంధ్రకేసరి, సామనగర్, శారదనగర్, దేశ్‌ముఖ్, గౌరెల్లి, తారామతిపేట్ ఫీడర్ల పరిధిలో నిర్వహణ పనుల కారణంగా బుధవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని డీఈ తెలిపారు. 11 కేవీ ఆంధ్రకేసరి, గౌరెల్లి ఫీడర్ల పరిధిలోని ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు, 11 కేవీ సామనగర్, శారదనగర్, దేశ్‌ముఖ్, తారామతిపేట్ ఫీడర్ల పరిధిలో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ ఉండదన్నారు.

నిర్వహణ పట్టించుకోరు..నిర్లక్ష్యం వీడరు !

● విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ కనిపించని రక్షణ చర్యలు
● ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతున్నా లేని విచారణ
● ఏఈల నిర్లక్ష్యంతో తరుచూ విద్యుత్ అంతరాయాలు

హైదరాబాద్ సిటీ, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ సరఫరాలో కీలకమైన డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్ల నిర్వహణలో క్షేత్రస్థాయి ఇంజనీర్ల నిర్లక్ష్యం వీడకపోవడంతో ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతున్నాయి. మలక్‌పేట సెక్షన్ చంచల్‌గౌడ చౌరస్తా సమీపంలో మంగళవారం విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లలో స్పార్క్ (మిరుగులు)వచ్చి ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోయింది. గ్రేటర్‌జోన్ పది సర్కిళ్ల పరిధిలో 1.5 లక్షల వరకు డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లు (డీటీఆర్)లు ఉండగా వాటిలో చాలావరకు ప్రమాదకరంగా ఉన్నాయి. విద్యుత్ ప్రమాదాలు జరగకుండా టీడీఆర్‌ల చుట్టూ రక్షణ చర్యలు తీసుకుంటామని విద్యుత్‌శాఖ చెబుతున్నప్పటికీ క్షేత్రస్థాయిలో అమలు చేయడలేదనే విమర్శలున్నాయి. కొంతమంది అధికారుల నిర్లక్ష్యం కారణంగా ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతున్నా వాటి పై ఎలాంటి విచారణలు చేపట్టడం లేదు. ఆపరేషన్ విభాగంలో కొంతమంది ఏఈ, ఏడీఈ, డీఈలు క్షేత్రస్థాయిలో పర్యటించకపోవడంతో విద్యుత్ సరఫరాలో తరుచూ అంతరాయాలు తలెత్తుతున్నాయి. ప్రతి యేటా ట్రాన్స్‌ఫార్మర్ల నిర్వహణకు దక్షిణ డిస్కం లక్షల్లో నిధులు కేటాయిస్తున్నా పరిస్థితుల్లో మార్పు రావడం లేదు. సర్కిల్, డివిజన్ స్థాయిలో అధికారులు పర్యటించాలంటూ టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ ఫరూఖీ ఆదేశాలు జారీచేసినా కొంతమంది అధికారులు కార్యాలయాలను వదిలి బయటకు రావడం లేదు. శివారు డివిజన్లలో పనిచేస్తున్న కొంతమంది అధికారులు ఫోన్లు కూడా లేపడం లేదంటూ ఉన్నతాధికారులకు ఫిర్యాదులు వస్తున్నా వారిపై ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు.

●ఇన్‌చార్జి డైరెక్టర్లకు అవగాహన అంతంతే..

తెలంగాణ దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థలో ఏడాది కాలంగా ఇంచార్జి డైరెక్టర్లతో పాలన కొనసాగుతోంది. ఇన్‌చార్జి డైరెక్టర్లకు దక్షిణ డిస్కం క్షేత్రస్థాయి పరిస్థితులపై పూర్తిగా అవగాహన లేకపోవడంతో సమస్యలు పెరుగుతున్నాయి. సమ్మర్ యాక్షన్ ప్లాన్‌లో భాగంగా విద్యుత్‌శాఖ చేపడుతున్న ముందస్తు చర్యలు, సర్కిళ్లు, డివిజన్ల వారీగా పెరుగుతున్న డిమాండ్‌కు అనుగుణంగా చేపట్టే అభివృద్ధి పనులపై ఇన్‌చార్జి డైరెక్టర్లు ఎలాంటి సమీక్షలు నిర్వహించడం లేదనే విమర్శలున్నాయి. గతంలో డైరెక్టర్లు తమ విభాగాల్లో జరిగే పనులపై ఉన్నతాధికారులతో ప్రత్యేక సమీక్షలు నిర్వహిస్తూ క్షేత్రస్థాయిలో పర్యటించి సమస్యల పరిష్కారంపై దిశా నిర్దేశం చేసేవారు.. కానీ ఇప్పుడు అలాంటి పరిస్థితులు లేకపోవడంతో సమస్యలు పేరుకుపోతున్నాయి. సీఎండీ నేరుగా సమీక్షలు నిర్వహిస్తున్న అంశాలపై మాత్రమే ఉన్నతాధికారులు దృష్టి పెడుతున్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా దక్షిణ డిస్కంలో రెగ్యులర్ డైరెక్టర్లను నియమించాలని సీనియర్ ఇంజనీర్లు సూచిస్తున్నారు.

పేలిన ట్రాన్స్‌ఫార్మర్.. ఎగసిపడిన మంటలు

సైదాబాద్, జనవరి 7(ఆంధ్రజ్యోతి): మలక్‌పేట నల్గొండ చౌరస్తా నుంచి చంచల్‌గూడ వైపు వెళ్లే ప్రధాన రహదారి పక్కన ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ మంగళవారం పేలి మంటలు ఎగసిపడ్డాయి. దీంతో ఆ మార్గంలో వెళ్లే వాహనాదారులు, స్థానికులు భయాందోళనకు గురయ్యారు. సమాచారం అందుకున్న వెంటనే అధికారులు విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. సమీపంలోనే ఉన్న మలక్‌పేట అగ్నిమాపక శాఖ కార్యాలయం సిబ్బంది ఘటనా స్థలానికి వెళ్లి మంటలను అదుపులోకి తేవడం పెనుప్రమాదం తప్పింది.



చంచలగూడ చౌరస్తా సమీపంలో కాలిపోతున్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

ఆర్టీసీ డ్రైవర్లు ఆదర్శంగా ఉండాలి

● వనస్థలిపురం ట్రాఫిక్ సీఐ గట్టుమల్లు

హయత్‌నగర్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): రోడ్డుపై తిరిగే ఇతర వాహనదారులకు ఆర్టీసీ డ్రైవర్లు ఆదర్శంగా ఉండాలని వనస్థలిపురం ట్రాఫిక్ సీఐ గట్టు మల్లు అన్నారు. రోడ్డు భద్రతా మాసోత్సవాలలో భాగంగా మంగళవారం హయత్‌నగర్ 1, 2 ఆర్టీసీ డిపోలలో నిర్వహించిన కార్యక్రమానికి హైదరాబాద్ డిప్యూటీ రీజనల్ మేనేజర్ జగన్‌తో కలిసి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ, డ్రైవర్లు డ్యూటీలో ఉన్నప్పుడు మద్యం తాగరాదని, డ్రైవర్లు విధిగా ట్రాఫిక్ రూల్స్‌ను పాటించాలన్నారు. ర్యాష్ డ్రైవింగ్, సెల్ ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్, ఓవర్ టేక్ వంటివి చేయొద్దని కోరారు. ఆర్టీసీ బస్సు అంటేనే నమ్మకానికి మరో పేరు అని హైదరాబాద్ డిప్యూటీ రీజనల్ మేనేజర్ జగన్ అన్నారు. ప్రజలు ఎంతో నమ్మకంతో ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తారని, ప్రమాదాల నివారణకు డ్రైవర్లు కృషి చేయాలని అన్నారు. అనంతరం సంస్థ ఉద్యోగులచే భద్రతా సూక్తిని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో డిపోల మేనేజర్లు విజయ్, శ్రీనివాస్, సహాయ మేనేజర్లు విజయకుమారి, రమాదేవి, సత్తయ్య, శ్రీనివాస్, నరేష్, వీవీకే రెడ్డి, ఉద్యోగులు పాల్గొన్నారు.



ఆర్టీసీ ఉద్యోగులచే ప్రతిజ్ఞ చేయిస్తున్న ఆర్టీసీ హైదరాబాద్ డిప్యూటీ రీజనల్ మేనేజర్ జగన్

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

కొత్తపేట, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ సురక్షితంగా ప్రయాణించాలని రాచకొండ ట్రాఫిక్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ (టీటీఐ) ఎస్‌ఐ ఎస్.నర్సింహారావు, ఏఎస్‌ఐపీ సోమనాథం సూచించారు. రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా కమిషనరేట్ పరిధిలోని ఉప్పల్ ఆర్‌జీఐఏ స్టేడియం, ఆటో స్టాండ్, హెరిటేజ్ ఫ్రై.లి. మల్లాపూర్ భాగ్యనగర్ డీసీఎం స్టాండ్, ఈసీఐఎల్, కీసర, కుషాయిగూడ, నాచారం స్నేహపురి క్రాస్ రోడ్స్, హబ్సిగూడ, నాచారం హెచ్ఎంటీ కాలనీ, ఉప్పల్ క్రాస్ రోడ్స్ తూఫాన్ వాహనాల స్టాండ్ తదితర 14 ప్రాంతాల్లో వాహనాల డ్రైవర్లకు, యజమానులకు, సాధారణ ప్రజలకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ట్రాఫిక్ నిబంధనలు, సూచనలు, రోడ్డు భద్రత, హెల్మెట్, సీటు బెల్టు ప్రాధాన్యత, మద్యం తాగి వాహనం నడిపితే జరిగే అనర్థాలపై అవగాహ కోసం రూపొందించిన కరపత్రాలను పంపిణీ చేశారు.

అభివృద్ధి నిధులు మంజూరు చేయండి: లచ్చిరెడ్డి

వనస్థలిపురం, జనవరి 7(ఆంధ్రజ్యోతి): బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాని ఎల్‌బీనగర్ జోనల్ కమి షనర్ హేమంత కేశవ్ పాటిల్‌ను బీఎన్‌రెడ్డినగర్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి కోరారు. ఈ మేరకు కార్పొరేటర్ మంగళవారం కమిషనర్‌కు వినతి పత్రం అందజేశారు. డివిజన్‌లో సీసీ రోడ్లు, వీధి దీపాలు, డ్రైనేజీ తదితర సమస్యల పరిష్కారానికి నిధులు మంజూరు చేయాలని కోరగా, కమిషనర్ సానుకూలంగా స్పందించారని కార్పొరేటర్ తెలిపారు.

భూగర్భ డ్రైనేజీ సమస్యలు పరిష్కరిస్తా: కళ్లెం

వనస్థలిపురం, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): కాలనీలో నెలకొన్న భూగర్భ డ్రైనేజీ సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తానని హయత్‌నగర్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి అన్నారు. హయత్‌నగర్ డివిజన్ శారదానగర్‌లో భూగర్భ డ్రైనేజీ సమస్యలను కాలనీవాసులతో కలిసి కార్పొరేటర్ నవజీవన్ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ, కాలనీవాసులు ఎదుర్కొంటున్న సమస్యలను తన దృష్టికి తీసు కువస్తే ప్రాధాన్యతా క్రమంలో పరిష్కరిస్తానన్నారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ ఏఈ హేము నాయక్, జలమండలి మేనేజర్ వాహిని, కాలనీవాసులు కేఎల్ఎన్ రావు తదితరులు పాల్గొన్నారు.

గ్రేటర్‌లో టీడీపీకి ప్రజాదరణ : నాగు నగేశ్

సైదాబాద్, జనవరి 7(ఆంధ్రజ్యోతి): గ్రేటర్ పరిధిలో టీడీపీకి ప్రజాదరణ పెరిగి సభ్యత్వ నమోదు కార్యక్రమానికి విశేష స్పందన లభిస్తోందని పార్టీ హైదరాబాద్ పార్లమెంట్ కో ఆర్డినేటర్ నాగు నగేశ్ అన్నారు. మంగళవారం కుర్మగూడ డివిజన్ భరత్‌నగర్‌లో పార్టీ నాయకుడు కట్ట సుదర్శన్ ఆధ్వర్యంలో చేపట్టిన టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. తెలంగాణలో టీడీపీకి పూర్వ వైభవం వస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు అన్వర్, జోగిందర్ సింగ్, అహ్మద్ షరీఫ్ పాల్గొన్నారు.



రోడ్డు పనులను ప్రారంభిస్తున్న బలాల, అరుణారెడ్డి

బస్తీల్లో సదుపాయాల కల్పనకు ప్రణాళికలు

●ఎమ్మెల్యే అహ్మద్ బలాల

సైదాబాద్, జనవరి 7(ఆంధ్రజ్యోతి): మలక్‌పేట నియోజకవర్గం పరిధిలోని అన్ని బస్తీలలో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రత్యేక ప్రణాళికలు రూపొందించినట్లు ఎమ్మెల్యే అహ్మద్ బలాల తెలిపారు. మంగళవారం శంకేశ్వర్ బజార్ బస్తీలో రూ.14.70 లక్షల వ్యయంతో చేపడుతున్న సీసీ రోడ్డు పనులకు కార్పొరేటర్ కొత్తకాపు అరుణారెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బస్తీవాసులు ఎడవెల్లి నర్సింహ్మా, పొన్న దర్శన్, కిషన్ ముదిరాజ్, జీహెచ్ఎంసీ ఏఈ వెంకన్న పాల్గొన్నారు.

మద్యం మత్తులో డ్రైవింగ్ ప్రమాదకరం

●టీటీఐ ఇన్‌స్పెక్టర్ అర్జున్

కొత్తపేట, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో వాహనాలు నడపడం ప్రమాదకరమని రాచకొండ ట్రాఫిక్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ (టీటీఐ) ఇన్‌స్పెక్టర్ అర్జున్ తెలిపారు. కమిషనరేట్ పరిధిలోని పలు ప్రాంతాల్లో నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్ వాహనాల తనిఖీల్లో మద్యం తాగి వాహనాలు నడిపి పట్టు బడిన వారిలో 64 మంది మందుబాబులకు వారి కుటుంబ సభ్యుల సమక్షంలో సీపీ క్యాంపు వద్ద ట్రాఫిక్ చిల్డ్రన్ పార్కు లెక్చర్ హాల్‌లో మంగళవారం 6 విడతలుగా కౌన్సెలింగ్ నిర్వహించారు. కౌన్సెలింగ్‌లో ఇన్‌స్పెక్టర్ అర్జున్ మాట్లాడుతూ, కుటుంబ సభ్యులు ఆధారపడి ఉన్నారని గుర్తుంచుకోవాలని, మద్యం మత్తులో వాహనాలు నడపడం మానుకోవాలని అన్నారు. మద్యం తాగి వాహనాలు నడిపి ప్రమాదాలకు గురైన వారి వీడియో క్లిప్పులు, ప్రముఖుల సందేశాలు, మద్యం మత్తు అనర్థాలకు అద్దం పట్టే పాటలను ప్రదర్శించారు. విశ్రాంత ఇన్‌స్పెక్టర్ అమరవర్ధన్‌రెడ్డి, ఎస్ఓపీ అల్లూరయ్య టీటీఐ సిబ్బంది రమేష్ తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జైపాల్‌రెడ్డి తదితరులు

ఐటీ టవర్స్ ఏర్పాటుకు కృషి చేయండి

●ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డికి కాంగ్రెస్ నేతల వినతి

అబ్దుల్లాపూర్‌మెట్, జనవరి 7(ఆంధ్రజ్యోతి): పెద్దఅంబర్‌పేట్ ఓఆర్‌ఆర్ జంక్షన్ ప్రాంతంలో ఐటీ టవర్స్ ఏర్పాటుకు కృషి చేయాలని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డిని కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ అధ్యక్షుడు కొత్తపల్లి జైపాల్‌రెడ్డి కోరారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఎమ్మెల్యే రంగారెడ్డిని కలిసి వినతి పత్రం సమర్పించారు. విజయవాడ జాతీయ రహదారిపై ఔటర్ జంక్షన్ ఉందని, దాని సమీపంలో ప్రభుత్వ భూములు అందుబాటులో ఉన్నాయన్నారు. ఐటీ టవర్స్ ఏర్పాటు చేస్తే పెద్దఅంబర్‌పేట్‌తో పాటు పరిసర ప్రాంతాలు మరింత అభివృద్ధి చెందే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. స్పందించిన ఎమ్మెల్యే రంగారెడ్డి ఈ విషయాన్ని పరిశీలించాలని కోరుతూ రాష్ట్ర ఐటీశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుకు లేఖ రాశారని జైపాల్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు సిద్దంకి కృష్ణారెడ్డి, పసుల రాజేందర్‌ముదిరాజ్, చర్లపల్లి శంకరయ్యగౌడ్, పండుగుల రాజు, వడ్డేపల్లి విజయేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీ పైప్‌లైన్ పనులు పునః ప్రారంభం

మన్సూరాబాద్, జనవరి 7(ఆంధ్రజ్యోతి): ఆర్ అండ్ బీ అధికారులు అనుమతివ్వకపోవడంతో ఆరు నెలల క్రితం నిలిచి పోయిన డ్రైనేజీ పైప్‌లైన్ పనులు ఎట్టకేలకు పునః ప్రారంభమయ్యాయి. ఈ పనులను మంగళవారం మన్సూరాబాద్ డివిజన్ కార్పొరేటర్, జీహెచ్ఎంసీ బీజేపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ కొప్పుల నర్సింహా రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గత 25 ఏళ్లుగా డివిజన్ పరిధిలోని గణేష్‌నగర్, సాయినాథ్ కాలనీ, మల్లికార్జున నగర్ కాలనీ, ఆగమయ్యనగర్ కాలనీల్లో డ్రైనేజీ వ్యవస్థ సరిగ్గాలేకపోవడంతో నివాసితులతో పాటు విజయవాడ ప్రధాన రహదారిని ఆనుకొని ఉన్న వ్యాపార సంస్థలు, దుకాణదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని ఎంతో పోరాడి నిధులు మంజూరు చేయించి పనులు ప్రారంభించామన్నారు. అయితే, ఆర్ అండ్ బీ శాఖ అధికారులు అమనుమతించకపోవడంతో ఆరు నెలల క్రితమే పనులు నిలిచిపోయాయన్నారు. నాటి నుంచి తీవ్రంగా పోరాడగా ఆర్ అండ్ బీ అధికారులు అనుమతి ఇవ్వడంతో ఎట్టకేలకు పనులు పునః ప్రారంభం కావడం సంతోషకరమన్నారు. ఇందుకు సహకరించిన గత జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి, ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్, ఆర్ అండ్ బీ అధికారులు ఈఈ ఆశలత, డీఈ ధర్మారెడ్డి తదితరులకు కార్పొరేటర్ నర్సింహా రెడ్డి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.



డ్రైనేజీ పైప్‌లైన్ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ నర్సింహా రెడ్డి

ఫారెస్ట్ సమీపంలో మంటలు.. ఆర్పివేసిన ఫైర్ సిబ్బంది

అబ్దుల్లాపూర్‌మెట్, జనవరి 7 (ఆంధ్ర జ్యోతి): పతుల్లాగూడ ముక్తిఘాట్ ఎదురుగా రోడ్డు పక్కన ఉన్న చెత్త కుప్పలకు మంగళవారం సాయంత్రం మంటలు అంటుకున్నాయి. ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు చెత్త కుప్పలకు నిప్పు పెట్టడంతో ఆ మంటలు సమీపంలోని హరిణ వనస్థలి ఫారెస్టు వరకు వెళ్లాయి. మంటలను గమనించిన స్థానికులు వెంటనే ఫైర్ స్టేషన్, నాగోల్ పోలీసులకు సమాచారం అందించారు. అక్కడికి చేరుకున్న ఫైర్ సిబ్బంది మంటలను ఆర్పేశారు. అయితే మంటలు ఫారెస్టు లోపలికి వెళ్లకపోవడంతో ప్రమాదం తప్పింది.



మంటలను ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

రేవంత్‌రెడ్డిది రైతు ప్రభుత్వం

●టీపీసీసీ సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షుడు మిద్దెల జితేందర్

చంపాపేట, జనవరి 7(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు ఇచ్చిన మాట ప్రకారం భూమిలేని వ్యవసాయ కుటుంబాలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం కింద ఏడాదికి 12 వేల రూపాయలను అందిస్తుందని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షుడు మిద్దెల జితేందర్ పేర్కొన్నారు. చంపాపేట డివిజన్ కర్మన్‌ఘాట్‌లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, గత బీఆర్ఎస్ ప్రభుత్వం రైతులను మోసం చేసిందన్నారు. గుట్టలు, రాళ్లురప్పలకు వేలాది కోట్ల రూపాయలను ఇచ్చిందని అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్ర భుత్వం రైతు ప్రభుత్వం అని అన్నారు. మొదటి విడతగా జనవరి 26 నుంచి వ్యవసాయ యోగ్యమైన భూములన్నింటికీ ఎకరాకు రూ. 6 వేల చొప్పున ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కింద ప్రభుత్వం అందిస్తుందన్నారు. ప్రతిపక్ష నాయకుల ఆరోపణలు తిప్పికొట్టడానికి రైతులు సిద్ధంగా ఉన్నారని మిద్దెల జితేందర్ అన్నారు.

కుటుంబ కలహాలతో భర్తను చంపిన భార్య

ఆదిభట్ల, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాలతో భర్తను భార్య హత్య చేసిన ఘటన రంగారెడ్డి జిల్లా ఆదిభట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం తెల్లవారుజామున జరిగింది. సీఐ రాఘవేందర్ రెడ్డి కథనం ప్రకారం.. శ్రీకాకుళం జిల్లా, కంచిలి మండలానికి చెందిన అంకుల షణ్ముఖరావు (51), ఉమాపతి దంపతులు తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధిలోని రాగన్నగూడలో ఆరు నెలలుగా అద్దెకు ఉంటున్నాడు. కూలీ పనులు చేసుకుంటూ జీవిస్తున్నారు. షణ్ముఖరావు మద్యానికి బానిసై పనికి వెళ్లకుండా నిత్యం భార్యను వేధించే వాడు. సోమవారం రాత్రి ఇద్దరూ మద్యం తాగి గొడవ పడ్డారు. భర్తను భార్య విచక్షణారహితంగా కొట్టడంతో అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. మంగళవారం తెల్లవారుజామున ఇంటి యజమాని వచ్చి తలుపుకొట్టగా తీయలేదు. అనుమానం వచ్చి తలుపులను పగులకొట్టి చూడగా షణ్ముఖరావు గదిలో రక్తం మడుగులో పడి ఉన్నాడు. పోలీసులకు సమాచారం ఇవ్వగా ఘటనా స్థలాన్ని పరిశీలించి భార్య ఉమాపతిని అదుపులోకి తీసుకున్నారు కేసు దర్యాప్తులో ఉంది.

అన్నా వదినలపై హత్యాయత్నం

● నిందితుడిపై కేసు నమోదు

హయత్‌నగర్ జనవరి 7 (ఆంధ్రజ్యోతి): భూ వివాదంలో అన్నా వదినతో పాటు వారి కుమారుడిపై హత్యాయత్నం చేసిన తమ్ముడిని హయత్ నగర్ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్ చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీ పసుమాల గ్రామానికి చెందిన మోదీపు శ్రీనివాస్ గౌడ్, అతడి అన్న మోడెపు సత్యనారాయణ గౌడ్‌ల మధ్య కొంతకాలంగా భూ వివాదం నడుస్తోంది. ఇదిలా ఉండగా, మంగళవారం సత్యనారాయణ గౌడ్, భార్య భారతమ్మ, కుమారుడు బాలకిషన్‌లతో కలిసి కారులో పసుమాముల నుంచి రామాలయం వైపు వెళ్తుండగా శ్రీనివాస్ గౌడ్ కారును ఆపి రాళ్లతో దాడి చేశాడు. దీంతో కారు అద్దాలు పూర్తిగా ధ్వంసమయ్యాయి. అనంతరం రాడ్డుతో వదిన భారతమ్మపై దాడి చేశాడు. దీంతో బాధితురాలు మంగళవారం సాయంత్రం హయత్ నగర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా, శ్రీనివాస్ గౌడ్‌పై హత్యాయత్నం కేసు నమోదు చేశారు. కేసు దర్యాప్తులో ఉంది.

శ్రీకాంత్ కుటుంబానికి అండగా ఉంటాం

●ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య

ఇబ్రహీంపట్నం, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం పోలీస్ పరిధి రాయపోల్ గ్రామంలో కులోన్మాద హత్యకు గురైన కొంగర నాగమణి భర్త శ్రీకాంత్ కుటుంబానికి అండగా ఉంటామని రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అన్నారు. మంగళవారం రాయపోల్ గ్రామంలో నాగమణి భర్త శ్రీకాంత్ అతని తల్లిదండ్రులు హంసమ్మ, సత్తయ్యలను పరామర్శించి ఏసీపీ కేపీవీ రాజు ద్వారా కేసు వివరాలు తెలుసుకున్నారు. హయత్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న నాగమణిని గతేడాది డిసెంబరు 2న రాయపోల్- మాన్యగూడలో రోడ్డులో సొంత తమ్ముడు పరమేష్ వేట కొడవలితో దారుణంగా చంపిన విషయం తెలిసిందే. కాగా పరమేష్‌తోపాటు అతనికి సహకరించిన అచ్చన్న, శివ ప్రస్తుతం రిమాండ్‌లో ఉన్నారు. నాగమణి అదే గ్రామానికి చెందిన వేరే కులానికి చెందిన బండారి శ్రీకాంత్‌ను ప్రేమించి పెళ్లి చేసుకుంది. వద్దని వారించినా కులాంతర వివాహం చేసుకుందనే కోపంతో పరమేష్ దారికాచి ఆమెను హత్య చేయడం అప్పట్లో సంచలనం సృష్టించింది. కాగా ఈ హత్యకు మరికొందరు సహకరించినట్లు ఆరోపణలు ఉన్నందున వెంటనే వారిని అరెస్టుచేసి విచారణ జరిపించాలని శ్రీకాంత్ కుటుంబ సభ్యులు కమిషన్ చైర్మన్‌ను కోరారు.

40 బస్తాల రేషన్ బియ్యం పట్టివేత: ఇద్దరి రిమాండ్

హయత్ నగర్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): రేషన్ బియ్యం అక్రమ దందా గుట్టును హయత్‌నగర్ పోలీసులు రట్టు చేశారు. వినియోగదారుల నుంచి తక్కువ ధరకు కొనుగోలు చేసి అక్రమంగా ఓ గదిలో దాచి పెట్టిన 40 బస్తాల రేషన్ బియ్యాన్ని పట్టుకున్నారు. వివరాలు... పెద్ద అంబర్‌పేట్‌లోని ఓ సర్వీసింగ్ సెంటర్ వెనుక గదిలో 40 బస్తాల రేషన్ బియ్యం ఉన్నట్లు పోలీసుకు గుర్తు తెలియని వ్యక్తుల సమాచారం ఇచ్చారు. వెంటనే పోలీసులు అక్కడికి వెళ్లి స్వాధీనం చేసుకొని సీజ్ చేశారు. సంతోష్ నాయక్, నెహ్రూ నాయక్ అనే ఇద్దరు రేషన్ కార్డుదారుల నుంచి తక్కువ ధరకు బియ్యాన్ని కొనుగోలు చేసి ఎక్కువ ధరకు ఇతరులకు విక్రయిస్తున్నట్టు పోలీసులు తెలిపారు. ఇద్దరినీ తీసుకొని రిమాండ్‌కు తర లించారు.